సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024


బాణసంచా వెలుగులు, విద్యుత్ దీప కాంతుల్లో మెరిసిపోతున్న యుద్ధ నౌకలు


నాట్య మయూరి

న్యూస్‌రీల్

మేట్రిన్ సస్పెన్షన్

సాక్షి,పాడేరు/ అరకులోయ టౌన్: అరకులోయలోని కంఠబంసగుడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల మేట్రిన్ మాధవిని సస్పెండ్ చేస్తూ గిరిజన సంక్షేమశాఖ డీడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే పాఠశాలలో 9వ తరగతి గిరిజన విద్యార్థిని కిల్లు వసంత ఈనెల 13న అరకులోయ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై సమగ్ర విచారణకు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన అధికారులు ఆయనకు నివేదిక ఇచ్చారు. ఈ పాఠశాలలో మేట్రిన్‌గా విధులు నిర్వహిస్తున్న మాధవిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు పాడేరులో స్పందన

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ విజయ సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10గంటల నుంచి నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. జిల్లా ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలను వినతుల రూపంలో తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్నిశాఖల జిల్లా అధికారులు నిర్ణీత సమయానికి ఐటీడీఏకు హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అడ్డతీగల/గంగవరం : విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ ఎండీ యూసఫ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల నుంచి సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

షట్టర్ల మరమ్మతులకు నిధులు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్


తాబేలుగుమ్మి చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

జి.మాడుగుల: చెక్‌డ్యామ్‌ల షట్టర్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి సమీపంలోని తాబేలుగుమ్మి చెక్‌డ్యామ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. రూ.2.17లక్షలతో నిర్మించిన రిటైనింగ్ వాల్ పనులను ఆయన తనిఖీ చేశారు. చెక్‌డ్యామ్ మూడు షట్టర్లకు మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరందించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఆశాఖ అధికారులకు సూచించారు. కాలువల్లో పూడిక తీస్తే రూ.పది వేల ఎకరాలకు సాగునీరందుతుందని అయన అన్నారు. సాగునీరు వృథా కాకుండా చివరి ఆయకట్టుకు నీరందించాలని సూచించారు. ఎస్ఎంఐ డీఈఈ ఆర్ నాగేశ్వరరావు, జేఈ స్వాతి, సర్పంచ్ చిలకమ్మ, ఉపాధిహామీ సిబ్బంది, పెదలోచలి, కె.కోడాపల్లి రైతులు పాల్గొన్నారు.

మిశ్రమ చేపల పెంపకంతో లాభాలు

- కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య విభాగ శాస్త్రవేత్త వీరాంజనేయులు


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త వీరాంజనేయులు

రంపచోడవరం: పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో మిశ్రమ చేపల పెంపకంపై ఐదు రోజులు పాటు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం గురువారం రెండో రోజుకు చేరుకుంది. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి (ఎన్ఎఫ్‌డీబీ) ఆర్థిక సహాయంతో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శిక్షణలో కేవీకే మత్స్య విభాగం శాస్త్రవేత్త డా. కె వీరాంజనేయులు మాట్లాడుతూ చేప పిల్లల ఎంపిక, చెరువుల నిర్మాణ పద్ధతులు, చేపల రవాణా, చేప పిల్లల వాతావరణ అనుకూలత, మేత, వ్యాధుల, వాటి నివారణ పద్ధతులు, చేపల పట్టుబడి విధానం పవర్ పాయింట్ ద్వారా వివరించారు. శిక్షణలో భాగంగా రైతులను చేపల చెరువుల వద్దకు తీసుకువెళ్లి క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. రంపచోడవరం, రాజవొమ్మంగి, గంగవరం మండలాల రైతులు పాల్గొన్నారు.



సరిలేరు.. మీకెవ్వరూ..

- మిలాన్–2024 పరేడ్‌లో అలరించిన సమర సామర్థ్య విన్యాసాలు
- జనసంద్రమైన ఆర్కే బీచ్
- ముఖ్య అతిథిగా హాజరైన రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్‌భట్
- గౌరవ అతిథులుగా నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: సముద్రాన్ని చీల్చుకుంటూ దూసుకొచ్చిన హైస్పీడ్ బోట్లు.. వినీలాకాశంలో చక్కర్లు కొడుతూ దివి నుంచి సాగర జలాల్లోకి త్రివర్ణ పతాకంతో దిగివచ్చిన స్కై డైవర్లు.. శత్రు స్థావరాలపై మెరైన్ కమాండోల మెరుపు దాడులు.. గాలికంటే వేగంగా దూసుకొచ్చి బాంబుల వర్షం కురిపించిన యుద్ధ విమానాలు.. జెట్ స్పీడ్‌తో ఒడ్డుకు చేరుకున్న జెమినీ బోట్లు.. సముద్రంలో చిక్కుకున్న వారిని సాహసోపేతంగా రక్షించిన కమాండోలు.. ఒకటి కాదు.. రెండు కాదు.. కళ్లు చెదిరే విన్యాసాలతో ఆర్‌కేబీచ్ కదనరంగాన్ని తలపించింది. ప్రతిష్టాత్మక మిలాన్- 2024 వేడుకల్లో ముఖ్య భాగమైన ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ అద్భుతంగా సాగింది. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్, నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ పాల్గొన్న ఈ వేడుకలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. గురువారం సాయంత్రం 5 గంటలకు ముఖ్య అతిథులు వేదికపైకి చేరుకుని.. ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. తూర్పు తీరం ఎంతటి శత్రుదుర్భేద్యమో.. సుశిక్షితులైన సిబ్బంది తమ యుద్ధ విన్యాస ప్రదర్శనలతో చాటిచెప్పారు. ఇండియన్ నేవీతో పాటు 51 దేశాల నౌకాదళ, రక్షణదళ శక్తి సామర్థ్యాలను ప్రత్యక్షంగా వీక్షించే అదృష్టం నగర వాసులకు మరోసారి దక్కింది. ఈ అద్భుతమైన విన్యాసాలు భారత నౌకాదళ శక్తి, సామర్థ్యాలను చాటిచెప్పాయి.

విన్యాసాలు సాగాయిలా..

- ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఐదు హాక్ ఎయిర్‌క్రాఫ్టలపై కమాండోలు బాంబ్ పేలుడు, వ్యూహాత్మక విన్యాసాలతో కూడిన ఎయిర్ పవర్ ప్రదర్శన చేశారు. మూడు హాక్ విమానాలు 400 నాటికల్ మైళ్ల వేగంతో సాగర జలాలకు అతికొద్ది ఎత్తులో.. గాల్లో చక్కర్లు కొడుతూ అలరించాయి. రెండు హాక్ జెట్లపై కమాండోలు సముద్రానికి తక్కువ ఎత్తులో ఆధునిక వైమానిక పోరాటంలో ఉపయోగించే వ్యూహాలను ప్రదర్శించి అబ్బుర పరిచారు. మూడు భిన్నమైన హెలికాప్టర్లపై మూడు విభిన్న పద్ధతుల్లో సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించే ప్రదర్శనలు అద్భుతంగా సాగాయి. సీహాక్స్ హెలికాప్టర్లు తొలి సారిగా విశాఖ ప్రజలను అలరించాయి. రోమియోలుగా చెప్పుకునే ఈ హెలికాప్టర్లు బాణసంచా వెలుగులతో కొత్త అనుభూతిని పంచాయి. పారా సెయిలింగ్ కోసం 8 వేల అడుగుల ఎత్తు నుంచి ఐదుగురు సాహస దళాలు పారాచూట్ సాయంతో దూకారు. గురుత్వాకర్షణ శక్తిని సైతం జయిస్తూ గాల్లో చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.
- పారాడోర్నియర్ పీకే బస్తోలా ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకంతో పాటు భారత నౌకాదళ పతకాన్ని చేతపట్టుకుని 8 వేల అడుగుల ఎత్తు నుంచి ఆక్సిజన్ మాస్క్ సాయంతో దూకారు. మెరైన్ కమాండో పారాచూట్ సాయంతో కిందికి దిగి.. ముఖ్య అతిథి రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌భట్‌కు జ్ఞాపిక అందించారు. భారత నౌకాదళానికి చెందిన అత్యంత వేగవంతమైన మిగ్–29కే యుద్ధ విమానాలు స్మాల్ షిప్స్ బాంబులు పేలుస్తూ సముద్ర జలాల్లో దూసుకుపోయాయి. గాల్లో చక్కర్లు కొడుతూ ఏరోడైనమిక్స్ విన్యాసాలతో అందర్నీ అలరించాయి. మూడు మిగ్ 29 యుద్ధ విమానాలు ఒక్కసారిగా దూసుకొచ్చి.. బాంబుల వర్షం కురిపించాయి. కమాండర్ బస్పీదర్‌యాదవ్ నేతృత్వంలో జాతీయ పతాకాన్ని, నౌకాదళ పతాకాన్ని ఆవిష్కరించేలా.. నాలుగు చేతక్ హెలికాప్టర్లు తక్కువ ఎత్తులో ఎగురుతూ బ్యానర్ ఫార్మేషన్‌లో ఆకట్టుకున్నాయి. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన తేజెస్ యుద్ధ విమానాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సాంస్కృతిక ప్రదర్శన

విద్యుత్ దీపకాంతులతో మెరిసిన యుద్ధ నౌకలు

భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ జలశ్వా, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, ఐఎన్ఎస్ ముంబై, ఐఎన్ఎస్ విక్రాంత్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, ఐఎన్ఎస్ చెన్నై యుద్ధ నౌకలు విద్యుద్దీపాలంకరణలో మెరిసిపోయాయి. యుద్ధ విన్యాసాలను తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ తదితరులు వీక్షించారు.


మిలాన్ నౌకాదళ విన్యాసం


దూసుకుపోతున్న హాక్ విమానాలు


తీరం.. త్రివర్ణ శోభితం

సిటీ పరేడ్ సాగిందిలా..


కవాతులో పాల్గొన్న నావికులు


కళాకారుల విన్యాసం


విశాఖ ప్రత్యేకతను తెలియజేసేలా శకటం


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

సాక్షి, విశాఖపట్నం: మిలాన్–2024 విన్యాసాలకు మరింత సొగసు తెచ్చేలా.. అంతర్జాతీయ సిటీ పరేడ్‌ను కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ ప్రారంభించారు. వివిధ దేశాలకు చెందిన నౌకాదళాలు, కోస్ట్‌గార్డ్ బృందాలు నిర్వహించిన కవాతు ఈ కార్యక్రమానికి హైలెట్‌గా నిలిచింది. రాష్ట్రానికి చెందిన కళలకు సిటీ పరేడ్‌లో పెద్దపీట వేశారు.

- 205 మంది విశాఖపట్నం నేవీ చిల్డ్రన్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు కలర్స్ ఆఫ్ లైఫ్ పేరుతో నృత్య ప్రదర్శనతో పరేడ్‌ను ప్రారంభించారు.
- యుద్ధనౌకల్లో ప్రదర్శించే హార్న్‌పైప్ డ్యాన్స్ ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. 55 మంది సీ క్యాడెట్ కార్ప్స్ నృత్య ప్రదర్శనతో అదరగొట్టారు.
- కమాండర్ హైకమ్ బిక్ నాయకత్వంలో 51 దేశాల జాతీయ పతాకాలను ప్రదర్శిస్తూ నేవీ బ్యాండ్ ప్రదర్శన, మార్చ్‌ఫాస్ట్ అలరించింది.
- నేవీ బ్యాండ్ మాస్టర్ ఆంథోనీ రాజ్ నేవల్ బ్రాస్ బెండ్ ఉర్రూతలూగించింది.
- ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఇండియన్ కోస్ట్‌గార్డ్ దళాలు కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆర్మీ బ్యాండ్ అదరగొట్టింది.
- ఏపీ స్టేట్ పోలీస్ దళం, ప్రత్యేక పోలీసు బలగాలు, ఆక్టోపస్ బృందం, ఏపీ స్టేషన్ ఫైర్ సర్వీసెస్ బలగాలు మార్చ్‌ఫాస్ట్ చేశాయి.
- కోరుకొండ సైనిక్ స్కూల్ బృందం మిలటరీ బీట్‌తో, సీ క్యాడెట్ కార్ప్స్ తన బ్యాండ్‌తో ఉత్సాహాన్ని నింపాయి.
- రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే గరగలు డ్యాన్స్ విదేశీ ప్రతినిధులను ఆకట్టుకుంది.
- రాష్ట్ర నృత్యమైన కూచిపూడి, గిరిపుత్రుల మధ్య స్నేహ సౌభ్రాతృత్వాలు పెంపొందించే థింసా నృత్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.
- కొమ్ముకోయ గిరిజన నృత్య ప్రదర్శనకు విదేశీయులు ఫిదా అయ్యారు.
- దాండియా, గార్బా, డప్పు నృత్యం, పులివేషం, అమ్మవారి వేషాలు, కోలాటాలు, తప్పెటగుళ్ల తదితర ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి.
- పరేడ్ అనంతరం శకటాల ప్రదర్శన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిబింబించేలా ప్రదర్శించిన నవరత్నాల శకటం సిటీ పరేడ్‌కు హైలైట్‌గా మారింది.జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ చేపట్టిన ప్రాజెక్టులు, భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టుల నమూనాలు, సిటీ ఆఫ్ డెస్టినీ శకటాలు ఆకట్టుకున్నాయి.
- భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, నౌకాదళ శక్తి సామర్థ్యాలను చాటిచెప్పేలా ఏర్పాటు చేసిన లేజర్ షో అదరహో అనిపించింది.


ఆకట్టుకున్న డప్పు కళాకారుల ప్రదర్శన


విద్యుత్ దీపకాంతుల్లో ధగధగలాడుతున్న విశాఖ బీచ్‌రోడ్డు

వైఎస్సార్‌సీపీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

పార్టీ నియోజకవర్గ పరిశీలకురాలు శోభ హైమావతి దేవి పిలుపు


మాట్లాడుతున్న హైమావతి దేవి

అరకులోయ టౌన్: అరకులోయలో ఈనెల 24న నిర్వహించే వైఎస్సార్ కాంగ్రెస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకురాలు శోభ హైమావతి దేవి పిలుపునిచ్చారు. పద్మాపురం పంచాయతీ రణజిల్లెడ సమీపంలోని వి.రిసార్ట్స్‌లో నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అరకు నియోజకవర్గ సమన్వయకర్త రేగం మత్స్యలింగం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేస్తున్న సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతీ ఇంటికి అందించిన సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించడం ద్వారా పార్టీ విజయానికి దోహదపడుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబుల సమన్వయంతో పార్టీ క్యాడర్ పనిచేయాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సమష్టిగా కష్టపడి పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ గిరిజనులంటే జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో ప్రేమ ఉందని, పాలనలో ఈ ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు జెడ్పీటీసీ శెట్టి రోషిణి, ఎంపీపీలు నీలవేణి, ఉషారాణి, ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్ పాల్గొన్నారు.

పాడేరులో నియోజకవర్గస్థాయి సమావేశం..


విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఈనెల 24న నిర్వహిస్తున్నామని ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈసమావేశానికి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు.మండల పార్టీ అధ్యక్షులు.ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నామినేటెడ్ ప్రతినిధులు కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలి

పంచాయతీ కార్యదర్శులకు చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య సూచన


సమావేశంలో మాట్లాడుతున్న పీవో కావూరి చైతన్య

చింతూరు: గ్రామాభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గురువారం నాలుగు మండలాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డులు అందేలా చర్యలు చేపట్టాలని, త్వరలో చింతూరులో నిర్వహించే జాబ్‌మేళా గురించి నిరుద్యోగ యువతకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయాల్లో జాప్యం లేకుండా సేవలు అందేలా చూడాలని, అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందని సూచించారు. డీఎల్పీవో రాఘవన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉపాధిహామీ ద్వారా చేపట్టాల్సిన పనులతో పాటు గ్రామాల్లో చేపట్టాల్సిన ఇతర పనులను గుర్తించాలని, పన్నులు వందశాతం వసూలు అయ్యేలా చూడాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికను తయారుచేసి మండలస్థాయి అధికారుల అనుమతితో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

చింతూరులో 27న జాబ్‌మేళా

- కలెక్టర్ విజయ సునీత
- పోస్టర్ ఆవిష్కరణ


జాబ్‌మేళా ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ విజయసునీత

సాక్షి,పాడేరు: చింతూరులో ఈనెల 27న నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎం.విజయసునీత కోరారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ,జిల్లా ఉపాధి కార్యాలయం,సీడాప్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈమెగా జాబ్‌మేళా ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ తన ఛాంబర్‌లో గురువారం సాయంత్రం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 27వతేదీ మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు చింతూరు సమీపంలోని ఎర్రంపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో మెగా జాబ్‌మేళా జరుగుతుందన్నారు. మెడికల్, ఆటోమొబైల్, లాజిస్టిక్, ఇతర రంగాలకు చెందిన ఎనిమిది కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాకు హాజరవుతారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఇతర ఉన్నత విద్య అభ్యసించి, 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉన్నవారు ఈ మేళాకు హాజరుకావాలని ఆమె కోరారు. అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు పాన్, ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలను ఇంటర్వ్యూలకు తీసుకురావాలని ఆమె సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10వేల నుంచి రూ.20వేల వేతనం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థను 6304634447 నంబరులో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

రాయితీపై యంత్రాల పంపిణీ


యంత్రాలను పంపిణీ చేస్తున్న నందు తదితరులు

సాక్షి,పాడేరు: జాతీయ ఆహార భద్రత పథకంలో జిల్లాకు 50శాతం రాయితీపై పిండిమర,చిరుధాన్యాల మిల్లు యంత్రాలు మంజూరయ్యాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు తెలిపారు. వర్తనాపల్లి, గుత్తులపుట్టు, లగిశపల్లి, ఇరడాపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు స్థానిక రైతుభరోసా కేంద్రంలో గురువారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3హెచ్‌పీకి సంబంధించి 20పిండిమర, చిరుధాన్యాల మిల్లుల యంత్రాలు, 2 హెచ్‌పీకి సంబంధించి 16 పిండిమర, చిరుధాన్యాల యంత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఏడీఏ ఎం.శ్రీనివాస్, ఏవోలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా
- 112 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పాడేరు: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్‌బాషా కోరారు. మకలపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆశ్రమ పాఠశాలలోని 112 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులను మెరుగైన వైద్య సేవలు అందించే నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వసతి గృహంలో వంట గదితో పాటు సిక్ రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులు ఉపయోగిస్తున్న తాగునీటి పథకాన్ని పరీక్షించి తగిన నిర్ధారణ పరీక్షలు జరిపి నివేదిక అందజేయాలని ఎంపీహెచ్‌పీ, వైద్యాధికారి, వసతి గృహ నిర్వాహకులను ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలోని అన్ని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఎనీమియా, శ్వాసకోస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన వైద్యం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తామన్నారు. డివిజన్‌లోని 36 పీహెచ్‌సీల్లో ఇప్పటికే 1.35లక్షల సికిల్‌సెల్ ఎనీమియా, ఐఈసీ మెటీరియల్‌ను మూడు భాషాల్లో ముద్రించి పంపిణీ చేశామని ఆయన వివరించారు.

క్లుప్తంగా

'ప్రతిభ' ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు : ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ నిర్వహిస్తున్న ప్రతిభ విద్యాలయాల్లో 2024–25లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐటీడీఏ పీవో, పథక నిర్వహణ అధికారి వి. అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం జిల్లా మారికవలస (బాలికలు), విజయనగరం జిల్లా జోగంపేట (బాలురు) ప్రతిభ విద్యాలయాల్లో ఎనిమిదో తరగతి, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూగురుకులం.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 25వరకు గడువు ఉందన్నారు. ఏప్రిల్ 4న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. పాడేరు గిరిజన గురుకుల పాఠశాల (బాలికలు), పాడేరు గిరిజన గురుకుల కళాశాల (బాలికలు), అరకువేలి, చింతపల్లి గిరిజన గురుకుల పాఠశాల(బాలురు)లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

భక్తిశ్రద్ధలతో పప్పు పండగ



రాజంపాలెంలో పూజలు చేస్తున్న గిరిజనులు

గంగవరం : మండలంలోని రాజంపాలెంలో గురువారం పప్పుపండగను ఘనంగా నిర్వహించారు. ఏజన్సీ గిరిజన గ్రామాల్లో గిరిజనులు పండించిన పప్పు దినుసులను మాఘ మాసంలో గ్రామ దేవతలకు నైవేద్యంగా సమర్పించి వాటిని స్వీకరించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిని గిరిజన గ్రామాల్లో పప్పు పండగగా పిలుస్తారు. దీనిలో భాగంగా రాజంపాలెంలో గ్రామ దేవతలైన కొండ రాజులకు మొక్కు లు చెల్లించుకున్నారు. ఏటా వర్షాలు బాగా పడాలని, పంటల బాగా పండాలని పూజలు చేశారు. అనంతరం ఊరిబంతి నిర్వహిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

26న మినీ జాబ్‌మేళా

అనకాపల్లి: సబ్బవరం డిగ్రీ కళాశాలలో ఈనెల 26న నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నక్కపల్లి హెటిరో కంపెనీ మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, ఎమ్మెస్సీలో కెమిస్ట్రీ, డిప్లొమా (మెకానిక్) విద్యనభ్యసించి, 18 నుంచి 27 సంవత్సరాల మధ్య వయస్సుగల యువతీ యువకులు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 81063 27482 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్రామ వలంటీర్ల సేవలకు వందనం



ఉత్తమ వలంటీర్లను సన్మానిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



చొడుపల్లి వలంటీర్ ఉగ్రంగి బిందుకుమారికి సేవా వజ్ర అవార్డును అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

అరకులోయ రూరల్: గ్రామ వలంటీర్ల సేవలకు వందనం చేయాల్సిందేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని గురువారం గ్రామ వలంటీర్లకు అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీల పరిధిలోని 313 మంది గ్రామవలంటీర్లకు 306 మందికి సేవా మిత్ర అవార్డులు , ఐదుగురికి సేవా రత్న అవార్డులను, ఇద్దరికి సేవా వజ్ర అవార్డులను అందజేసి, ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు చేస్తున్న సేవలు ఎంతో ఆదర్శనీయమన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచి సేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వ సేవలను ప్రతి గడపకు అందిస్తున్న వలంటీర్లకు ప్రజలు, ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీ ఉషారాణి, ఎంపీడీవో వెంకటేష్, వైస్ ఎంపీపీ రామన్న, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు భేష్

చింతపల్లిరూరల్: గ్రామ వలంటీర్ల సేవలు ఎప్పటికి మరువలేనివి అని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు.మండల కేంద్రంలో గురువారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో గ్రామ వలంటీర్లను ఆమె ఘనంగా సన్మానించారు. మండలంలో 421 మందికి గాను ఇద్దరికి సేవ వజ్రా, ఐదుగురికి సేవ రత్న, 414 మందికి సేవా మిత్ర అవార్డులు ప్రభుత్వం అందించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కరోనా లాంటి కష్ట సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా గ్రామవలంటీర్లు చేసిన సేవలు మరువులేనివన్నారు.సీఎం జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా, సక్రమంగా లబ్ధిదారులకు అందిస్తూ గ్రామ వలంటీర్లు అందరి మన్ననలను అందుకోవడం హర్షణీయమన్నారు. ప్రజాసేవలో ముందున్న వలంటీర్లకు వందనాలు తెలిపారు. ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, సర్పంచ్‌లు పాంగి లక్ష్మి, దురియా పుష్పలత , లోతా పండయ్య, లలిత, జెసీసీ మండల కన్వీనర్ గణబాబు, ఎంపీడీవో వీరసాయిబాబు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ మోరి రవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ మీరా, కో–అప్షన్ సభ్యులు నాజర్‌వలీ, ఎంపీటీసీ సభ్యులు ధారలక్ష్మి, జయలక్ష్మి, మోహన్‌రావు, మీనాకుమారి, నాయకులు జోషఫ్, శ్రీరాములు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో సేవా వజ్ర అవార్డును వలంటీర్ బొంజుబాబుకు అందజేస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, అధికారులు

డుంబ్రిగుడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన గ్రామ వలంటీర్లకు సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేస్తున్న గ్రామ వలంటీర్ల సేవలు మరులేనివన్నారు. ఉత్తమ సేవలందించిన గ్రామ వలంటీర్లకు అవార్డులు అందజేసి, సన్మానించారు. ఎంపీడీవో చంద్రరావు, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి , లీలారాణి, ఎంపీటీసీ సభ్యులు విజయ, గీత, నాయకులు శ్రీరాములు ,సునీల్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఆధార్ కేంద్ర కార్యాలయ ప్రాంతీయ శాఖ ప్రతినిధి వరప్రసాద్

పాడేరు : ఆధార్ నమోదు చేయడంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు మరింత అవగాహన కలిగి ఉండి తప్పులు దొర్లకుండా చూసుకోవాలని హైదరాబాద్ ఆధార్ కేంద్ర కార్యాలయ ప్రాంతీయ ప్రబంధకులు వరప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో గ్రామ, వార్డు సచివాలయల శాఖ ఆధ్వర్యంలో ఆధార్ నమోదు ప్రక్రియపై పాడేరు డివిజన్‌లోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ అసిస్టెంట్లకు ఇప్పటికే అనేక పర్యాయాలు శిక్షణ ఇచ్చినప్పటికీ తప్పులు దొర్లుతున్నాయన్నారు. తప్పులు లేకుండా ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టి ప్రజలకు లబ్ధి చేకూర్చాలన్నారు. తప్పుల సవరణ, కొత్తగా ఆధార్ నమోదు, డెమోగ్రాఫిక్ సవరణలు, పదేళ్లుగా ఎటువంటి లావాదేవీలు లేని ఆధార్ కార్డుల నవీకరణ తదితర అంశాలపై విజయవాడ ఏపీటీ ఆన్‌లైన్ విభాగాధిపతి ఎస్.సుందరం డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. పాడేరు డివిజనల్ అభివృద్ధి అధికారి డి.శాంతలక్ష్మి, ఎంపీడీవో సాయి నవీన్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మూడు నెలల క్రితం గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం



మహిళ మృతదేహం వద్ద అధికారులు, కుటుంబ సభ్యులు

అనంతగిరి : మూడు నెలల క్రితం ఉవ్వాగెడ్డలో గల్లంతైన మిరియాల కమల మృతదేహం రెండు రాళ్ల మధ్య గురువారం బయటపడింది. మండలంలోని భీంపోల్ పంచాయతీ సమీపంలో ఉవ్వాగెడ్డను దాటుతుండగా సీతపాడు గ్రామానికి చెందిన గెమ్మెల లక్ష్మి, గెమ్మెల కుమార్, మిరియాల కమల ఈ ముగ్గురు గిరిజనులు మూడు నెలల క్రితం గల్లంతైన విషయం తెలిసిందే. లక్ష్మి, కుమార్‌ల మృతదేహాలు లభ్యం కాగా, మిరియాల కమల ఆచూకీ లభ్యం కాలేదు. అప్పుడు నాలుగు రోజుల పాటుగా ఏపీఎస్‌డీఆర్ బృందాలు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. గురువారం ఉవ్వా సమీపంలో గల కొత్తవలస గ్రామ గిరిజనులు చేపలు పట్టేందుకు గెడ్డకు వెళ్లగా రెండు రాళ్ల మధ్యలో మహిళ మృతదేహం కనిపించింది. దీంతో అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్ నరసింహమూర్తి, ఎస్ఐ కరక రాము అక్కడికి చేరుకున్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో అది మూడు నెలల క్రితం గల్లంతైన మిరియాల కమలగా నిర్ధారించారు. మృతదేహం నీటిలో ఉండడంతో పూర్తిగా పాడైంది. వైద్యాధికారి సమక్షంలో అక్కడే శవపంచనామా చేసి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎంపీటీసీ అశోక్ పాల్గొన్నారు.

గ్రామస్తులకు పోలీసుశాఖ సాయం



బిర్రగుడ గ్రామస్తులకు సిమెంట్ బస్తాలు అందజేసిన ఎస్ఐ శివకుమార్

మోతుగూడెం: రంపచోడవరం ఓఎస్‌డీ కె.వి.మహేశ్వరరెడ్డి , చింతూరు ఏఎస్పీ, రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్ర ఆదేశాల మేరకు డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నర్సింగ్‌పూర్, బిర్రగుడా గ్రామాల్లో డొంకరాయి ఎస్ఐ శివకుమార్ పర్యటించి వారి సమస్యలను తెలుసుకొని అవగాహన సమావేశం నిర్వహించారు. బిర్రగుడ గ్రామంలో తాగునీటి సరఫరా లేదని, కొండల పై నుంచి వచ్చే జలపాతం వినియోగిస్తున్నామని గ్రామస్తులు చెప్పారు. ఆ నీటిని నిల్వ చేసేందుకు ట్యాంకులు నిర్మిస్తే గ్రామస్తుల తాగునీటి అవసరాలు తీరుతాయని కోరారు. దీనిపై ఎస్ఐ శివ కుమార్, ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు బిర్రగుడ గ్రామంలో తాగునీటి ట్యాంకుల నిర్మాణం కోసం 10 సిమెంట్ బస్తాలను అందజేశారు. అలాగే నర్సింగిపూర్ గ్రామంలో వాటర్ మోటార్ ఉంది కానీ, వాటర్ స్టోరేజ్ కి ట్యాంక్ లేదని వేసవి కాలంలో విద్యుత్ అంతరాయం కలిగితే అప్పుడు ఇబ్బందులు పడుతున్నామని చెప్పడంతో ఎస్ఐ శివ కుమార్ , ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారికి 500లీటర్ల ప్లాస్టిక్ వాటర్ ట్యాంక్, సిమెంట్ దిమ్మ కోసం 5 సిమెంట్ బస్తాలను అందచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివ కుమార్ మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉన్నత విద్య, క్రీడలపై దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మావోయిస్టుల సహకారం అందించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బచ్చులూరు సర్పంచ్ వేమా సంధ్యారాణి, గ్రామ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెరుగైన బోధనపై ఉపాధ్యాయులకు సూచనలు



ఉపాధ్యాయులతో చర్చిస్తున్న లిప్ ప్రోగ్రాం రాష్ట్ర కమిటీ సభ్యులు

అరకులోయటౌన్: మండలంలోని కొత్తభల్లుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలను లిప్ ప్రోగ్రాం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఈశ్వరరావు, సీహెచ్.ఎస్.దొర తదితరులు గురువారం సందర్శించింది. పాఠశాలలో లిప్ ప్రొగ్రామ్ పనితీరును పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించి సందేహాలను నివృత్తి చేశారు. చదువులో వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి మెరుగుదల సాధించాలని సూచించారు. ఎంఈవో భారతిరత్నం, ఏఎస్‌వో జి.సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో ముద్దాయి అరెస్టు

గౌరగొమ్మి గ్రామాన్ని సందర్శించిన అడిషినల్ ఎస్పీ ధీరజ్ కునుబిలి



గౌరగొమ్మి గ్రామంలో బాలిక నానమ్మను విచారిస్తున్న అడిషినల్ ఎస్పీ ధీరజ్ కునుబిలి

గంగవరం : మండలంలో సంచలనం సృష్టించిన పదేళ్ల బాలిక అత్యాచార కేసులో ముద్దాయిని గంగవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను రంపచోడవరం అడిషినల్ ఎస్పీ ధీరజ్ కునుబిలి గురువారం తెలిపారు. ఈ నెల 18న గౌరగొమ్మి గ్రామానికి చెందిన అన్నిక జానకి రాముడు అనే వ్యక్తి పక్కింట్లో చెల్లెలు వరస గల పదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి పరారయ్యాడన్నారు. బాలికకు మాయ మాటలు చెప్పి గౌరగొమ్మి శివారులో దుంప తోటల వైపు గల ఛాప రాయి వద్దకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. బాలిక తండ్రి ఈ నెల 19న గంగవరం పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు అడిషనల్ ఎస్పీ వివరించారు. పరారీలో ఉన్న ముద్దాయి గంగవరం మండలం ఉయ్యాలమడుగు గ్రామ శివారులో ఉన్నట్లు అందిన సమాచారం మేరకు అడ్డతీగల సీఐ రవికుమార్, గంగవరం ఎస్సై రామకృష్ణ సిబ్బందితో గాలించగా ముద్దాయి పట్టుబడ్డాడన్నారు. ముద్దాయిని అరెస్టు చేసి శుక్రవారం రంపచోడవరం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరపరుస్తామని తెలిపారు. తొలుత అడిషినల్ ఎస్పీ గౌరగొమ్మి గ్రామంలో బాలిక ఇంటిని సందర్శించి ఆమె నానమ్మను విచారించారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



విజేత టీమ్‌కు షీల్డ్ ఇస్తున్న సీఆర్‌పీఎఫ్ ఓసీ ఉదయ్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాస్

జి.మాడుగుల: అసాంఘిక, చెడు వ్యసనాలకు గిరిజన యువత దూరంగా ఉండి, అన్ని రంగాల్లో రాణించాలని సీఆర్‌పీఎఫ్–198 బిఎన్ ఓసీ ఉదయ్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మండలంలో నుర్మతి ఏవోపీ సీఆర్‌పీఎఫ్–198 బెటాలియన్ ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీల్లో విజేత దిప్పలగొంది టీమ్‌కు, ద్వితీయ బహుమతి చెరువువీధి టీమ్‌లకు షీల్డులు, టీ షర్టులు అందజేశారు. ఈ పోటీల్లో ఆరు టీమ్‌లు పాల్గొన్నాయి. క్రీడల్లో పాల్గొన్న టీమ్‌లకు వాలీబాల్, నెట్‌లు అందజేశారు. సీఆర్‌పీఎఫ్ ఇన్స్పెక్టర్ రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

150 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన కారు, బుల్లెట్, గంజాయి, నిందితులతో సీఐ, సిబ్బంది

అరకులోయటౌన్ : అరకులోయ పోలీస్ సర్కిల్ పరిధిలోని సుంకరమెట్ట సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా లారీతో పాటు కారులో తరలిస్తున్న 150 కిలోల గంజాయి పట్టుకున్నట్లు సీఐ సీహెచ్ రుద్రశేఖర్ తెలిపారు. గురువారం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి తరలిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారంతో సుంకరమెట్ట వద్ద కాపు కాసి పట్టుకున్నామన్నారు. లారీలో 100 కిలోల గంజాయి, కారులో 50 కిలోల గంజాయి తరలిస్తున్న వాహానాలకు పైలెట్‌గా వెళ్తున్న బుల్లెట్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయితో పట్టుబడిన నిందితుల్లో అరకులోయ పట్టణంలో నివాసం ఉంటున్న పాంగి శ్యామ్ గణేష్, కొర్రా కోగేశ్వరరావు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాంబాబు ఆలియాస్ యాదవ్, వీరేంద్ర ఉన్నారన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 3 లక్షలు ఉంటుందన్నారు. ఒడిశాలో కిలో గంజాయి రూ. 2 వేలకు కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు నిందితులు తెలిపారన్నారు. ఎస్ఐ సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న పీవో

రంపచోడవరం: మెనూ ప్రకారం ఆహార పదార్థాలు నాణ్యతగా తయారు చేసి విద్యార్థులకు అందించాలని స్థానిక ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక గురుకుల బాలిక కళాశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కళాశాల ప్రాంగణం, తరగతి గదులు, స్టాక్ రూమ్ పరిశీలించారు. నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు, వెండర్లు సరఫరా చేసే కూరగాయలు, కోడి మాంసం వివరాలను సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకోసం తయారు చేసిన ఆహార పదార్థాలను పీవో పరిశీలించారు. నాణ్యమైన, రుచికరకంగా తయారు చేసి వడ్డించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. కళాశాలలో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని, రన్నింగ్ వాటర్ సదుపాయం ఉండాలని అధికారులను ఆదేశించారు. కళాశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు.

ప్రాథమిక విద్య బోధన తప్పనిసరి

స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి



సంపూర్ణ పోషణ కిట్‌ను వర్కర్‌కు అందజేస్తున్న ఆర్‌జేడీ

కొయ్యూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను విధిగా బోధించాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ ఎం. చిన్మయిదేవి ఆదేశించారు. గురువారం ఇక్కడ అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారుల వివరాలను పోషణ యాప్‌లో విధిగా నమోదు చేయాలని అంగన్‌వాడీ వర్కర్లకు సూచించారు. రేషన్‌కార్డు /ఆధార్‌లోను పేరు ఒకే విధంగా ఉండాలని సూచించారు. పిల్లల బరువు, ఎత్తును విధిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివాసీ చిన్నారులకు సులభంగా అర్థమయ్యే రీతిలో కువీ భాషలో ముద్రించిన 11,500 పుస్తకాలను ఆమె పంపిణీ చేశారు.సంపూర్ణ పోషణ కిట్లను పం ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయకుమారి పాల్గొన్నారు.

వేగవంతంగా శాటిలైట్ ఫౌండేషన్ భవనాలు

విశాఖ జోన్‌లోని ఆరు జిల్లాల పరిధిలో 539 శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలల భవన నిర్మాణం చురుగ్గా జరుగుతోందని స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ ఎం .చిన్మయదేవి తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలున్న ప్రాంతాల్లోని వీటిని చేపట్టినట్టు చెప్పారు. ఒకొక్క భవనానికి ప్రభుత్వం రూ.16 లక్షలు వెచ్చిస్తోందన్నారు. రెండో దశలో 575 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు.

సారా బట్టీలు ధ్వంసం



డుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయతీ సిమిలిగుడ గ్రామంలో ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో అక్రమంగా ఉన్న సారా తయారీ బట్టీలను గురువారం ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేశారు. డ్రమ్ముల్లో పెట్టిన పులుపు 4,150 లీటర్లు, సారా 40 లీటర్లు ధ్వంసం చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ సారా తయారుచేసినా, విక్రయించినా చర్యలు తీసుకొని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అదనపు విలువలు జోడిస్తే మంచి ఆదాయం

- పెద్దాపురం ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మమత .
- దుంపలతో ఉత్పత్తుల తయారీపై మహిళలకు ఉచిత శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త మమత



వివిధ దుంపలతో తయారు చేసిన ఆహార పదార్థాలు

రంపచోడవరం: కర్రపెండలం, చిలకడ దుంప, కందలో పోషక విలువలు ఉన్నాయని వాటికి అదనపు విలువలు జోడించడం ద్వారా మార్కెట్ విలువ పెరుగుతుందని పెద్దాపురం ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. కె మమత సూచించారు. పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో దుంపలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై చేపట్టిన రెండు రోజుల నైపుణ్య శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుంపలతో చిప్స్, బిస్కట్లు, మురుకులు, అప్పడాలు,స్టార్చ్ పిండి, మిక్చర్, జెల్లీ, జామ్,పాస్తా తయారు చేయవచ్చన్నారు. వీటిని మార్కెట్లో విక్రయించడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చన్నారు. మార్కెటింగ్, ప్యాకింగ్ పద్ధతులను ఆమె వివరించారు. శిక్షణ ద్వారా కర్రపెండలం, చిలకదుంప, కంద వంటి వాటితో వివిధ రకాల ఉత్పత్తుల తయారీపై ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మార్కెట్‌లో నేరుగా అమ్ముకునే కంటే అదనపు విలువలు జోడించడం ద్వారా ధర పెరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డా. వై జానకి పాల్గొన్నారు. కేవీకే శాస్త్రవేత్త క్రాంతికుమార్ శిక్షణకు సమన్వయకర్తగా వ్యవహరించారు. శాస్త్రవేత్తలు డా. కె వీరాంజనేయులు, డా. ఎన్ చిరంజీవి, డా. ప్రవీణ్‌బాబు, రంపచోడవరం, గంగవరం, అడ్డతీగలలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.